# అంధత్వాన్ని జయించిన శివాని

### -ఐఐఎం పూర్తితో అందరికి ఆదర్శం

**జహీరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** అంధత్వాన్ని విద్యార్థిని శివాని జయించింది. అంధత్వం ఏ పనికి అడ్డుకాదని శివాని నిరూపించింది. జహీరాబాద్ పట్టణంలోని గడికిచెందిన కొత్తకొట గోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతుల రెండవ సంతానమైన శివాని అంధత్వంతో ఉన్నప్పటికి చదువుపై ఉన్న మమకారంతో ప్రాథమిక, ఉన్నత విద్యను హైదరాబాద్‌లోని బేగంపేటలోని దేవనార్ పబ్లిక్ స్కూల్‌లో విద్యను అర్జించి 10వ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయింది. ఇంటర్మీడియట్‌ను జహీరాబాద్ పట్టణంలోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో కామర్స్ పూర్తి చేసి వెల్లోని సత్యభామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళ్యాశాలలో చేరి బిబిఏ పూర్తి చేసింది శివాని. క్యాట్ పరీక్ష కొరకు ఆన్‌లైన్‌లో శిక్షణ అందుకుని 2023లో నిర్వహించిన ఐఐఎం కోర్సు కొరకు పరీక్ష రాసి దేశంలో 21 ఐఐఎం కళాశాలలు ఉండగా 19 కళాశాలల్లో విద్యను అందుకునేందుకు అర్హత సాధించింది. మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్ ఐఐఎంను ఎంచుకుని రెండు సంవత్సరాలు కోర్సును పూర్తి చేసింది.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం

**ములుగు, జూన్ 20 (ప్రభాతవార్త):** కారు ఢీకొని విద్యార్థి మృతి చెందిన సంఘటన ములుగు రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ విజయకుమార్ కథనం ప్రకారం ములుగుకు చెందిన తన్నీరు ఎల్లం(16) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి నడుచుకుంటూ బయలు దేరాడు. ఎల్లం రోడ్డుకు ఎడమవైపు మట్టి దారిలో నడుచుకుంటూ వెళ్తుండగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకోగానే సిద్దిపేటనుండి అతివేగంగా వచ్చిన హుందాయ్ ఐ10 కారు(ఏపి28 డిసి7227) ఎల్లంను ఢీకొంది. దీంతో ఎల్లం తలకు, కాళ్ళ, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందు కున్న 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అతడి పరిస్థితి విషమంగా ఉండడం తో గాంధీ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో ఎల్లం తల్లిదండ్రులు లక్ష్మక్కపల్లిలో గల ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ జగిత్యాల మండలం తక్కెళ్లపల్లి గ్రామానికి చెందిన ముప్పారపు చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

### టి.పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణకు

# పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్

సిద్దిపేట, ప్రభాతవార్త

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ (గ్రేడ్–2 పరీక్ష ఈనెల 24 నుంచి 29 వరకు డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్ష జూన్ 30 నుంచి జూలై 4 వరకు పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ రోజు రెండు సెషన్ల వారిగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహణ జరుగుతుందన్నారు. జిల్లాలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ 3296 మంది డివిజనల్ అకౌంట్ ఆఫీసర్1250 మంది అభ్యర్థులు 2 సెంటర్లలో పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) సుభాష్‌చంద్రబోస్, అయాన్ సెంటర్ కళాశాల ప్రిన్సిపాల్స్,విపి రాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



ఎంపిపి జంగం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, జూన్ 20 ప్రభాతవార్త:** విద్యుత్ శాఖ అధికారుల తీరుపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ పని తీరును మెరుగపరుచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. గురువారం ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ముఖ్యంగా మండల విద్యుత్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే సంజీవరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గతంలో విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గుర్తించిన సమస్యలను ఇప్పటికీ పరిష్కరించకపోవడంపై మండిపడ్డారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ శంకర్‌కు మెమో జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాముఖ్యత ఇస్తుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఉన్న పనుల వివరాలను ప్రజలకు వివరించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు.

**ఎంపిటిసిలకు సన్మానం..**

ఈనెలాఖరుకు పదవీకాలం ముగియనున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్‌తో పాటు ఎంపీటీసీలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పదవీకాలం ముగిసిన ప్రజల కోసం పని చేయాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా, తహశీల్దార్ గ్రేసీబాయి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు లక్ష్మీ రమేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, మధుసూదన్, నారాగౌడ్, సత్యనారాయణ, ఆర్ఎన్. సంతోష్‌కుమార్, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పక్షం రోజులుగా జాడలేని భగీరథ నీరు

### -క్షేత్రస్థాయిలో కరువైన అధికారుల పర్యవేక్షణ

### -తండా వాసుల గొంతులు తడార్వేదెప్పుడు

**అల్లాదుర్గం, జూన్ 20, ప్రభాతవార్త:** పక్షం రోజులుగా ఆ తండా వాసులకు తాగునీరు సరఫరా కాకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువవడంతో గిరిజనులు తాగునీటి కోసం పక్షం రోజులుగా అల్లాడుతున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని ముప్పారం తండాకు గత పక్షం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. తండాకు నీరు సరఫరా కాకపోవడంతో తమ గొంతులు ఎండుకుపోతున్నాయని, నీటి ఎద్దడిని తీర్చాలని తండా వాసులు గొంతెండేలా మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారని తండా వాసులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. తండాలో భగీరథ నీరు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు ఆగిపోతాయో తెలియని దుస్థితి దాపురించిందని తండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తండాకు ప్రతి నిత్యం భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.



ముప్పారం తండాలో అలంకార ప్రాయంగా మారిన వాటర్ ట్యాంక్

# నులి పురుగులను నిర్మూలించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 20 (ప్రభాతవార్త):** నులి పురుగులను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం తూప్రాన్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఒక సంవత్సరం నుండి 19 ఏళ్ల కలిగిన 2,36,000 మంది పిల్లలకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో ఆల్బెండ జోల్‌మాత్రలు పిల్లలకు స్వయంగా సిబ్బందిచే వేయడం జరుగుతుందని, ఈ మాత్రం ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు కలగవన్నారు. ఈ మాత్రలు ఆరోగ్య సిబ్బందిచే పంపిణీ చేయబడతాయని, ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మెదక్ జిల్లాలోని ప్రతి పాఠశాల, ప్రతి అంగన్వాడీ కేంద్రం, ప్రతి కాలేజీలో ఒకరు విధిగా మాత్రలు అందించే విధంగా ప్రణాళిక చేసుకోవాలని, గ్రామ,పట్టణ స్థాయిలో టామ్ టామ్ వేయడం ద్వారా ప్రజలందరికీ నులి పరుగుల నిర్మూలన కోసం ప్రచారం చేయాలని ఆదేశించారు. నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అన్ని రకాలుగా వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ఇట్టి కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. నులి పురుగులు పిల్లలు ఆరు బయట ఆడుకున్నప్పుడు, చేతులు కడుక్కోకుండా ఆహారం భుజించినప్పుడు, బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయటం వల్ల, అపరిశుభ్ర పరిసరాలవల్ల సంక్రమిస్తాయని, పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ ప్రభావం వలన రక్తహీనత, చురుకుదనం, పోషకాహార లోపం, ఆకలి లేకపోవుట, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, విరోచనాలులాంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయని అన్నారు. నులిపురుగుల సంక్రమణ వ్యాప్తిని నియంత్రించడానికి ఎప్పటికప్పుడు శుభ్రమైన నిటిని త్రాగాలని, ఆహారంపై మూతలు ఉంచాలని, పండ్లు, కూరగాయలు శుభ్రమైన నీటితో కడగాలని, భోజనం చేసేముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. నులిపురుగుల నిర్మూలన కోసం ఉపాధ్యాయులు, అంగన్వాడీలు అందరు తమ వంతు కృషిగా చేయాల్సిన అవసరం ఉందని, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి ఆరోగ్యాన్ని సంరక్షించుట మనందరి కర్తవ్యమని, ఆరోగ్యకరమైన భావిభారత సమాజాన్ని అందించాలనే నులి పురుగులను నిర్మూలించాలని పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ కోసం ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు కలగజేయవని తెలిపారు. అనంతరం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు అధికారులు, సిబ్బంది కూడా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, సిద్ధిపేట ఆర్డీవో జయచంద్రారెడ్డి, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

# మున్సిపల్ చైర్మన్‌ను గద్దె దించుతాం

**సిద్దిపేట రూరల్, జూన్ 20, ప్రభాతవార్త :** సిద్దిపేట మున్సిపాలిటిలో బిఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు చేస్తున్న అక్రమాలకు కమిషనర్ ప్రసన్న రాణి సహకరించడం లేదన్న ఉద్దేశంతోనే ఇటీవల జరిగిన మున్సిపల్ సర్వ సభ్య సమావేశంలో కింద కుర్చి వేసి కూర్చొబెట్టి అవమానించారని కాంగ్రెస్, ఎంఐఎం కౌన్సిలర్లు సాకి బాల్‌లక్ష్మీఅనంద్, ముత్యాల శ్రీదేవిబుచ్చిరెడ్డి, రియాజ్, అబ్దుల్ నసీర్ మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్‌ను కూర్చిపై కింద కూర్చొబెట్టి అవమానించిన విషయమై విచారణకు వచ్చిన రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపక్ష కౌన్సిలర్లను ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. మహిళ కమిషనర్ అని చూడకుండా అవమానించడం సరికాదన్నారు. సిద్దిపేట మున్సిపాలిటిలో 20 ఏళ్ల నుంచి జరుగుతున్న అవినీతి అంతా ఇంత కాదని త్వరలోనే విజిలెన్స్ ద్వారా విచారణ జరపించడానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల్లో కంపౌడ్ వాళ్లు నిర్మించిన వాటికి ఇంటి నంబర్లు కేటాయించామని కమిషనర్‌పై ఒత్తిడి తేస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి రూ.40 లక్షలు మున్సిపాలిటిలో ఆమోదం చేసుకొని ఎక్కడ సీసీ కెమెరాలు బిగించలేదన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఇంకా గవర్నమెంట్ ఉందన్న భ్రమలో ఉన్నారని తెలిపారు. మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ భర్త పెత్తనం చెలాయించడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్‌పై అసత్యపు ఆరోపణలు, విమర్శలు చేస్తే చూస్తూ ఉరుకోమన్నారు. త్వరలోనే మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసంపెట్టి గద్దె దించి తీరుతామన్నారు.

## బిహెచ్ఇల్ డైరెక్టర్‌గా ద్వివేది

**రామచంద్రాపురం, జూన్ 20, ప్రభాతవార్త:** బీహెచ్ఈఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా గురువారం రాజేష్ కుమార్ ద్వివేది పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు రాజేష్‌కుమార్ ద్వివేది బీహెచ్ఈఎల్ జనరల్ మేనేజర్, హెడ్ కార్పొరేట్ ఫైనాన్స్‌గా విధులు నిర్వహించారు. రాజేష్ కుమార్ ద్వివేది 1992లో బీహెచ్ఈఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (ఫైనాన్స్)గా విధుల్లో చేరిఉన్నారు. గత 32 సంవత్సరాల అనుభవం ఉండటంతో సెప్టెంబర్ 2022 నుంచి రాంచీలోని హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కలిగి ఉన్నారు.

# ప్రారంభం కాని విద్యార్థుల ప్రత్యేక బస్సు

**చిన్నశంకరంపేట, జూన్ 20, ప్రభాతవార్త:** విద్యార్థులు సౌకర్యార్థం గతంలో అధికారులు ప్రత్యేక బస్సును నడిపించారు. పాఠశాలలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్న బస్సు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రామాయంపేట నుండి ఖాజాపూర్, రామాయపల్లి, శాలిపేట, వెంకట్రావ్‌పల్లి, చెన్నాయపల్లి, మదూర్, సంగాయపల్లి, గవ్వలపల్లి మీదుగా చిన్నశంకరంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కళాశాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సు నడిచేది. ఈ బస్సు నడిచినంత కాలం విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకునేవారు. ఈ బస్సులోని విద్యార్థులను చిన్నశంకరంపేటలో దింపాక రుద్రారం, చందపంపేట, దరిపల్లికి వెళ్లి విద్యార్థులను తీసుకువచ్చి తిరిగి చిన్నశంకరంపేటలో దింపేవారు. పాఠశాల సమయానుసారం రెండు పూటల బస్సు నడిచేది. బస్సు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ ఖర్చులు పెరిగిపోతున్నాయని అధికారులు చొరవతీసుకోవాలని ఆయా గ్రామాల విద్యార్థులు, తల్లి దండ్రులు కోరుతున్నారు. బస్సు నడపక పోతే రాస్తారోకో చేస్తామని విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ విరబాబును వివరణ కోరగా సోమవారం బస్సు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని, సిబ్బంది కొరత వల్లే బస్సు నడపలేక పోయామన్నారు.

## ప్రతి ఒక్కరూ యోగా జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలి

**సిద్దిపేట రూరల్, జూన్ 20, ప్రభాతవార్త :** హార్ట్ ఫుల్ నెస్ యోగా అండ్ మెడిటేషన్ సంస్థ ద్వారా యోగా దినోత్సవం పురస్కరించుకొని గురువారం సాయంత్రం బాలికల ఉన్నత పాఠశాలలో అసనాలు, ప్రాణాయామం, పిల్లల మేధాశక్తిని పెంచడానికి బ్రేటర్ మైండ్స్ ఎక్సర్‌సైజ్ నేర్పించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ జోనల్ కో–ఆర్డినేటర్ స్వరూపరాణి మాట్లాడుతూ ప్రతి రోజు యోగ చేయడం వల్ల మానసికంగా శారీరకంగా అరోగ్యంగా ఉంటారని తెలిపారు.కార్యక్రమంలో హార్ట్‌ఫుల్ నెస్ యోగా ట్రేనర్ వడ్డెపల్లి నగేష్, బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో రైతులను సన్మానిస్తున్న ఏపిజివిబి బ్యాంకు అధికారులు

## రైతులను సన్మానించిన ఎపిజివిబి అధికారులు

**జగదేవ్‌పూర్, జూన్ 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులను జగదేవ్‌పూర్ మండల ఏపిజివిబి బ్యాంకు అధికారులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏపిజివిబి బ్యాంకు మేనేజర్ పి.లావణ్య మాట్లాడుతూ గ్రామంలోని పలువురు రైతులు పంట రుణాలను తీసుకొని ప్రతి సంవత్సరం విధిగా వడ్డీలు కడుతూ తమ ఖాతాలను రెగ్యులర్‌గా రెన్యువల్ చేసుకోవడం జరుగుతుందని, అలాంటి రైతులు అందరికి ఈరోజు తమ బ్యాంకు ద్వారా శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే ముున్ముందు ఎక్కువ మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది చరణ్, లక్ష్మణ్, బస్వాపూర్ బ్యాంక్ మిత్ర మాసపాక శకుంతల, గ్రామ మాజీ సర్పంచ్ మాసపాక యాదగిరి, రైతులు గుండ ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, బస్వరాజు లక్ష్మయ్య, నర్సయ్య, ఆలేటి మల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, మహిళలు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**కొండపాక, జూన్ 20, ప్రభాతవార్త**

పిల్లల్లో నులిపురుగులు నివారించి ఆరోగ్యవంత జీవితం గడిపేలా చర్యలుతీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు.గురువారం కొండపాక మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో నులిపురుగుల మందులను విద్యార్థులకు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల దినోత్సవం రోజున 1 నుండి 19 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికి అల్బేండ జోల్ మాత్రలను తప్పని సరిగా వేయించాలన్నారు. నులిపురుగుల వలస కలిగే నష్టాల నుండి పిల్లలను కావాడాలని సూచించారు. నులిపురుగులవల్ల పిల్లల్లో శారీర ఎదుగుదల, మానసిక ఎదుగుదల, రక్తహీనత, పోషహాకార లోపంవంటి సమస్యలు ఏర్పడతయన్నారు, పిల్లలు క్రమశిక్షణ కలిగి ఉండి పాఠశాల స్థాయి నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పారచుకొని చదివితే భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదుగుతారని తెలిపారు. డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ శ్రీనివాస్ , ప్రోగ్రాం అఫీసర్ విజయరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు గురువారం 2,38పైచిలుకు పిల్లలకు మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈరోజు ఎవరైన పిల్లలు రాకపోతే ఈ నెల 27న మాత్రలను అందించడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. పిల్లలు ఆరుబయట అడుకున్నపుడు పాదరక్షలు ధరించాలని, భోజనం చేసే ముందు మల విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఆహార పదార్ధలపైన మూతలు తప్పని సరిగా పెట్టాలన్నారు. మల విసర్జనకు మరుగు దొడ్డినే వాడలని తెలిపారు. పిల్లలు గోర్లు పెరగకుండా ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ కాశినాథ్, డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అఫీసర్ డాక్టర్ వినోద్ బాబ్జి, డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం ఎఒ రవీందర్ రెడ్డి, ఎంపిపి మంచాల అనసూయ, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, కొండపాక పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వనిశా, ఎంఈఒ శ్రీనివాస్ రెడ్డి, ఎఎన్ఎంలు, అశా వర్కర్లు, ఉపాద్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్‌వాడి కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మాత్రలను ఎఎన్ఎంలు, అశా వర్కర్‌లు పంపిణీ



నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తున్న కలెక్టర్ మను చౌదరి



వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

# భగ్గుమన్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల వర్గ పోరు

### -ప్రొటోకాల్ అంశంలో ఒకరిపై మరొకరు ఆరోపణలు

### ఎంపిడివో కార్యాలయం ప్రారంభోత్సవంలో ఘర్షణ

**గుమ్మడిదల, జూన్ 20 ప్రభాతవార్త:** మండల పరిధిలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. ఎంపీడీవో కార్యాలయ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాలపై ప్రోటోకాల్ ప్రకారం పేర్లను ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ ఎంపీటీసీలు.. ప్రోటోకాల్ ప్రకారమే ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు ఘర్షణకు దిగారు. దీంతో ఒక్కసారిగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు భారీ ఎత్తున ఆరోపణలు చేసుకుంటూ తీవ్ర వాగ్వాదానికి దిగారు. అనంతరం పలువురు నాయకులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## భూనిర్వాసితుల నిర్ణయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతా : ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

**నర్సాపూర్ జూన్ 20. ప్రభాతవార్త :** సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితుల విధాన నిర్ణయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషిచేస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్‌లోని రైతువేదిక భవనంలో సంగారెడ్డి కెనాల్ రీచ్ 2లో భూములు కోల్పోతున్న పెద్దచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన భూనిర్వాసితుల రైతులతో అవార్డు విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసిత రైతుల అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అధికారుల కోరడం జరిగింది. ఈ మేరకు భూనిర్వాసిత రైతులు ప్రస్తుతం భూముల ధరలు ఎక్కువగా ఉన్నందున మార్కెట్ విలువనుబట్టి సమానంగా ధరలు నిర్వణయించాలని, అలాగే వీలైతే భూమికి బదులు భూములు ఇవ్వాలని వరు కోరారు. ఈ భూనిర్వాసిత రైతుల వినతులను, అభ్యంతరాలను, నిర్ణయాలను అధికారుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి కెనాల్ రీచ్2లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు ఆర్డీవో స్థాయిలోనున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూనిర్వాసిత రైతుల విదానపరమైన నిర్ణయాలకు సంబందంచిన ఆంశాలను జిల్లా కలెక్టర్ ద్వార ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని పేర్కొంటుఈ నివేదిక ప్రకారం ఉన్నాతాధికారుల తో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బూములు కోల్పోతున్న బూనిర్వాసిత రైతులు, అదికారలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేతకి ఆలయంలో అదనపు ఎస్పీ పూజలు



కేతకి ఆలయంలో పూజలు చేస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు

**ఝరాసంగం, జూన్ 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వర ఆలయాన్ని గురువారం జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు ఎస్పీని ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో సంజీవరావు పాదప్రక్షాళన చేసుకుని ఆలయంలో జంగములు వేద మంత్రాలు వల్లిస్తుండగా సంజీవరావు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంజవరావుకు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఝరాసంగం ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, ముత్యాలు, ఆలయ అర్చకలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అద్దెలు కట్టలేక డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు స్వాధీనం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 20, ప్రభాతవార్త :**

పేదలు ఇంటి అద్దెలు కట్టలేక ఖాళీగా ఉన్న స్థానిక డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్వాధీనం చేసుకున్న ఘటన రామాయంపేట మున్సిపాలిటీలో గురువారం జరిగికుంది. పట్టణంలో గత ప్రభుత్వం 250 డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసింది. మరో 50 ఇండ్లు పంపిణీ చేపేందుకు సిద్దంగా ఉంచారు. ఇటీవలే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అవి ఇంకా పేదలకు చేరలేదు. దీంతో పట్టణంలోని పలువురు నిరుపేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల తాళాలను ధ్వంసం చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ఏళ్లగా రామాయంపేటలోనే ఉంటున్నామని, తమకు ఎలాంటి ఇళ్లు లేదని అద్దె ఇళ్లల్లో ఉంటున్న రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి ఉందన్నారు. అలాంటి మాకు డబుల్‌బెడ్‌రూమ్‌లు రాలేదని, అద్దెలు కట్టలేకనే ఇక్కడ పంపిణీ చేయకుండా తాళాలువేసిన ఇళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

**కొహెడ, జూన్ 20, ప్రభాతవార్త :** క్షణికావేశంలో ఓ తల్లి అత్మహత్య చేసుకోవడంతో అ తల్లి కన్న బిడ్డకు తీవ్ర అవేదనను మిగిల్చింది. మండల పరిధిలోని బస్వాపూర్‌లో రూపా(24) అనే మహిళా బావిలో దూకి అత్మహత్య చేసుకుంది. మృతదేహం వద్ద చిన్నారి తల్లిని తదేకంగా చూస్తుండడం అక్కడున్న అందరినీ కలిచివేసింది. తల్లి మృత దేహం చుట్టూ చిన్నారి తిరుగుతూ విగతజీవిగా పడి ఉన్న తల్లి లేచి తనను దగ్గరకు తీసుకుంటూదేమోనని ధీనంగా చూడడం అక్కడ ఉన్న వారి హృదయాలను కదిలించింది. భార్య, భర్తల మధ్య గొడవవే మహిళా అత్మహత్యకు కారణమని తెలుస్తుంది.


మాట్లాడుతున్న రజితవెంకన్న

## విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న**

**హుస్నాబాద్, జూన్ 20, ప్రభాతవార్త :** విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలలో నులి పురుగులు ఎక్కువగా ఉంటాయని వాటికి ఈ మాత్రల ద్వార మాత్రమే చెక్ పెట్టవచ్చున్నారు. విద్యార్థులు ఈ మాత్రలు వేసుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత, తమ పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, కమినర్ మల్లిఖార్జున్, డిప్యూటి డిఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్, మెడికల్ ఆఫీసర్ నిఖిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి : ఎమ్మెల్యే


విద్యార్థులకు మాత్రలను వేస్తున్న ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, జూన్ 20 ప్రభాతవార్త:** నులి పరుగుల నివారణ కోసం 1-19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రులు వేయించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గువారం వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో నులి పురుగులు ఉంటే రక్తహీనత, కడుపులో నొప్పు వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. తప్పకుండా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప నరేదర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే...**

వెల్దుర్తికి చెందిన మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ భర్త శ్రీనివాస్ కాలేయం సమస్యతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి శ్రీనివాస్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. శ్రీనివాస్ తెలంగాణ మలి విడత ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. శ్రీనివాస్ అనారోగ్యానికి గురి కావడం దురదృష్టకరమని, అధైర్యపడొద్దని ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి భరోసా కల్పించారు.

## విద్యార్థులు అల్బెండజోల్ మందు గోళీలు వేసుకోవాలి



విద్యార్థులక నులిపురుగు నివారణ మందు బిళ్లను వేస్తున్న రమ్య

**ఝరాసంగం, జూన్ 20, ప్రభాతవార్త:** 1నుంచి 19 సంవత్సరాల వారు నూలి పురుగు నివారణ కొరకు విధిగా అల్బెండోజ్ మందు గోళీలను వేసుకోవాలని ఝరాసంగం పిహెచ్‌సి డాక్టర్ రమ్య సూచించారు. గురువారం ఝరాసంగంలోని మహాత్మా జ్యోతిపూలే పాఠశాలతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో అంతర్జాతయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థులకు మందు బిళ్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సుధాకర్, మహాత్మా జ్యోతి పూలే ప్రిన్సిపాల్ మాధవి సదుర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి


జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**అక్కన్నపేట, జూన్ 20, ప్రభాతవార్త :** జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బీంవేని రాకేష్ పిలుపునిచ్చారు. గురువారం అక్కన్నపేటలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాండ్రాల దాము ఆధ్వర్యంలో జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కాంగ్రెస్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన ఉదయం 10గంటలకు పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో ఈ మేళా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న జాబ్‌మేళాలో నియోజకవర్గంలోని దాదాపు 5వేల మంది యువకులకు ఉపాధి కల్పించనున్నట్లు సూచించారు. నిరుద్యోగ యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు పొందాలన్నారు. ఉద్యోగాలు రాని యువతకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి వేధేశాలకు పంపిచే ఆలోచన మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట టౌన్ అధ్యక్షులు రాజు, నాయకులు రమేష్‌నాయక్, త్రిమూర్తి, గణేష్, రాజునాయక్, నాగరాజు, రాజు, అర్జున్‌నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

**కంది, జూన్ 20, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు సమిష్టి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. గురువారం ఎంపిపి సరళా పుల్లారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గడచిన 5 ఏళ్లలో పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు అభివృద్ధికి సహకరించారని అభినందించారు. అధికారులతో ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనులుచేస్తే పురోగతి పరుగులు తీస్తుందన్నారు. డెంగ్యూ వ్యాధిపై ప్రజలక అవగాహన కల్పించాలని వైద్య శాఖకు సూచించారు. 5 ఏళ్లు పూర్తిచేసుకున్న ఎంపిటిసి సభ్యులకు, ఎంపిపి అధ్యక్షులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్, తహసీల్దార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

# విద్యార్థులు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

## ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, జూన్ 20, ప్రభాతవార్త :** చిన్నపిల్లలు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతులమీదుగా నులిపురుగుల నివారణ మాత్రలను వేయించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ 1 నుండి 19 వయస్సుగల పిల్లలు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. అంతేగాక విద్యార్థులుంటున్న చుట్టు పరిసరాలను పరిశుంగ్రా ఉంచుకోవాలన్నారు. పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంతో ఉండి బాగా చదువుకొని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో విజయ నిర్మల, మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, జడ్పీటీసి బాబ్యానాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ శేఖర్, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, కౌన్సిలర్ రాంచందర్, బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, తొంట వెంకటేశ్, షేక్ హుస్సెన్, సూరారం నర్సింలు, జ్ఞానేశ్వర్‌గుప్త, ఆంజనేయులుగౌడ్, నాగరాజుగౌడ్, మాజీ సర్పంచ్‌లు సేనాధిపతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీతారెడ్డి


మాజీ సర్పంచ్ కుటుంబానికి బీమా చెక్కును అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే

## మాజీ సర్పంచ్ కుటుంబానికి బీమా చెక్కు

నారాయణఖేడ్ టౌన్, జూన్ 20, ప్రభాతవార్త: మండల పరిధిలోని డీఎన్ తండాకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ గురుబాయి భర్త శంకర్ ఇటీవల ప్రమాదావశాస్తు మృతి చెందటంతో బిఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం ఉండటంతో గురువారం 2 లక్షల భీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు అందచేశారు. పార్టీ భీమా చెక్కుతో పాటు రైతు బంధు కింద మంజూరైన 5లక్షల రూపాయల చెక్కును సైతం మాజీ ఎమ్మెల్యే అందచేశారు. కార్యమ్రంలోజడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పరమేశ్వర్, మాజీ రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్ సత్యపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు శేరి రామకృష్ణ, శేరి శ్రీనివాస్, రవీందర్, కురుమ సంఘ తాలుకా అధ్యక్షులు మల్గొండ నారాయణ, హరినాయక్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్ గౌడ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## మృతిచెందిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

**-డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**

**జగదేవ్‌పూర్, జూన్ 20 (ప్రభాతవార్త):** తీగుల్ గ్రామంలో గత సంవత్సరం బతుకమ్మ పండుగ రోజున చెరువును శుభ్రంచేసే క్రమంలో మృతిచెందిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంత వరకు నెరవేరలేదని, ప్రస్తుత ప్రభుత్వం మృతుల కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. గురువారం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అక్టోబర్ మాసంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న హరీష్‌రావు, అప్పటి ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మృతిచెందిన యాదమ్మ, భారతమ్మ, బాబు కుటుంబాలకు పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని, పిల్లల చదువు బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని, కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం బాధాకరమని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. పిల్లల చదువులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలన్నారు. పరామర్శించిన వారిలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, రాష్ట్ర నాయకులు పులి కల్పన, బిఎస్పీ నాయకులు కనకప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తొగుటలో సంస్కృతి దీక్ష యజ్ఞం

**తొగుట, జూన్ 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుక్కాపూర్‌లో విశ్వహిందు పరిషత్ అధ్వర్యంలో సంస్కృతి దీక్ష యజ్ఞం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యజ్ఞంలో27 కుటుంబాలు 105 మంది హిందూ ధర్మం నుంచి క్రైస్తవంలో వెళ్లిన వారు తిరిగి హిందూధర్మాన్ని స్వీకరించార. కారయ క్రమంలో విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మాల సత్యం, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ధనుంజయ, సామాజిక సమరసత ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్ వెంకటేష్ జాదవ్, గ్యాదరి రాజారం, ప్రభాకర్‌రెడ్డి, సత్యం, నరసింహమూర్తి, బిజెపి మండల అధ్యక్షులు చిక్కుడు చంద్రం, ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షులు ఉల్లెంగల సాయికుమార్, పోచబోయిన స్వామి, చిక్కుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.


సంస్కృతి దీక్ష యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం


ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు పరిశీలిస్తున్న నాయకులు

## విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు

**డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు శివరాజ్**

**హుస్నాబాద్, జూన్ 20, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం విద్యను వ్యాపారం చేస్తున్నారని డివైఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు శివరాజ్ మండిపడ్డారు. గురువారం పట్టణంలోని పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారనే విషయం తెలుసుకుని ఎస్ఎఫ్ఐ నాయకులతో కలసి పాఠశాలలను సందర్శించారు. అనంతరం పాఠశాలలో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న పఠశాల ఎదుట ధర్నా నిర్వహించి విషయం మండల విద్యాశాఖ అధికారికి తెలియగా అధికారులు వచ్చి పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న కేంద్రాలను సీజ్ చేశారు. అనంతరం శివరాజ్ మాట్లాడుతూ బుక్‌స్టాల్స్‌లో అమ్మె పుస్తకాలను కాకుండా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం పాఠశాలలో అందిస్తున్న పుస్తకాలనే కొనుగోలు చేయాలనే నిబంధనలు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు యూనిఫాంతో మొదటు పెడితే పుస్తకాలు, ఫీజుల వరకు ప్రయివేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వసూళ్ల చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుతున్నా అధికారులు స్పందించకపోవడం పట్ల వారి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ప్రయివేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి విద్యను వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గుగులోతు రాజునాయక్, నాయకులు రవిందర్, సంపత్, అరవింద్, ఠాగూర్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు
## విద్యా జ్యోతి పథకం అమలు చేయాలి : పెర్క బాబు

**సిద్దిపేట అర్బన్, జూన్ 20, ప్రభాతవార్త:** పదో తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్యా జ్యోతి పథకం కింద అందిస్తామన్న రూ.10 వేలు వెంటనే అందించాలని బిఆర్ఎస్‌వి సిద్దిపేట పట్టణ మాజీ అధ్యక్షులు పెర్క బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించడానికి విద్యా జ్యోతి పథకాన్ని అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మొండి చెయ్యి చూపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దళిత, గిరిజన విద్యార్థులను మోసం చేస్తుందన్నారు. పాఠశాలలు ప్రారంభమై రోజులు గడిచిపోతున్న నేటికి విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలు పంపిణీ కాలేదన్నారు. విద్యాజ్యోతి పథకాన్ని అమలు చేయడంతో పాటు విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్నారు.

## పిల్లల్లో నులి పురుగుల నిర్మూలనకు
## ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కౌన్సిలర్ శోభరఘురామ్

**సిద్దిపేట రూరల్, జూన్ 20, ప్రభాతవార్త :**

పిల్లల్లో నులి పురుగుల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కౌన్సిలర్ కాటం శోభరఘురామ్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని 42వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గాయత్రి హైస్కూల్‌లో పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు అల్బెండజల్ మాత్రలను పంపిణీ చేసి మాట్లాడారు. మాత్రలు తీసుకోవడం వలన పిల్లలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఎదుగుదలకు, రక్తహీనత లేకుండా చేయడానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ పుష్ప, కళ్యాణీ, అశ కార్యకర్త అనురాధ, వార్డు ప్రజలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**ప్రతి పనికి ఓ రేటు, లేకుంటే రైతులకు తిప్పలే .. ఐనాపూర్ తాజా మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి**

**కొమురవెల్లి, జూన్ 20, ప్రభాతవార్త**

కొమురవెల్లి విద్యుత్ సెక్షన్‌లో పనిచేస్తున్న అధికారులు లంచాలకు అలవాటు పడి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఐనాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకు రమణారెడ్డి ఆరోపించారు. గురువారం గ్రామంలో రైతులతో కలిసి రమణారెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి మండలం ఐనాపూర్, తపాస్‌పల్లి గ్రామాల రైతులను విద్యుత్ విషయంలో ఏఈ మధు అండదండలతో రెండు గ్రామాల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ లైన్‌మెన్ రమేష్, గ్రామాల కట్టర్ నరసింహులు విధులు సక్రమంగా నిర్వర్తించకుండా ప్రైవేటు వ్యక్తులతో పనులుచేయిస్తూ రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తూన్నారని తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం ఇండ్ల మీటర్లకు, రైతుల బావుల వద్ద బోర్ మోటార్ల మీటర్ల పేరా డబ్బులు వసూలు చేసి ఇప్పటికి మీటర్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని సంబంధిత అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. ఐనాపూర్ నుండి తపాస్‌పల్లి గ్రామానికి వెళ్ళె దారిలో 100కేవీ ట్రాన్సాఫ్ఫార్మర్‌తో పాటు 10 కరెంటు స్థంభాలను, వైర్లను జూనియర్ లైన్‌మెన్, కట్టర్ నర్సింహులు ఇద్దరు కుమ్మకై అమ్ముకున్నారని తెలిపారు. ఐనాపూర్ గ్రామం ఓరైతుకు చెందిన నాలుగు స్థంభాలను అమ్ముకున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు జరపడానికి తపాస్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద రూ.30 వేలు లంచం తీసుకున్నారన్నారు. ప్రతి పనికి ఓరేటు అరేటుకు తగ్గా డబ్బులు ఇవ్వకుంటే రైతులకు ఇబ్బందులు తప్పవని తెలిపారు. లంచాలకు అలవాటు పడ్డా వీరిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే రైతులందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రమణారెడ్డితో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాయిత శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కర్రోళ్లరాజు, పాశం రమేష్, పచ్చిమడ్ల వెంకటేశ్, కాయిత అచ్యుత్‌రెడ్డి, బట్టు ఉదయ్, షాదుల్‌బాబు, ఆసీఫ్, తెలురాజు ఉన్నారు.

**విద్యుత్ అధికారుల అవినీతిని ముందే బయటపెట్టిన ప్రభాతవార్త...**

కొమురవెల్లి విద్యుత్ సెక్షన్‌లో అధికారులు కాసులివ్వనిదే పని చేయడంలేదని కొంత మంది రైతులు ప్రభాతవార్త దృష్టికి తీసుకురావడంతో గత నెలలో వారి అవినీతి భాగోతాన్ని ముందే బయట పెట్టింది. ప్రతి పనికి డబ్బులు ఇవ్వకపోతే లేనిపోని ఆంక్షలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొళ్ళిన పట్టించుకోకపోవడంతో అధికారుల తీరుపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.




కొమురవెల్లి విద్యుత్ సెక్షన్‌లో అవినీతి

-కాసులివ్వనిదే పని చేయడం లేదని ఆరోపణలు

-పట్టించుకోని విద్యుత్ అధికారులు

మాట్లాడుతున్న రమణారెడ్డి, పక్కన గత నెలలో ప్రభాతవార్తలో వెలువడిన న్యూస్ క్లిప్


కార్ ర్యాలీకి తరలివెళ్తున్న బిజెపి నాయకులు

## ర్యాలీకి బయిలుదేరిన బిజెపి నాయకులు

**నర్సాపూర్ జూన్ 20, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో బిజెపి అధ్వర్యంలో నిర్వహించే భారీ ర్యాలీ కి నర్సాపూర్ నియోజకవర్గం నుండి బిజెవైఎం రాష్ట్ర నాయకులు అర్వింద్ వాల్దాస్ అధ్వర్యంలో బిజెపి నాయకులు తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా బిజెవైఎం రాష్ట్ర నాయకులు అర్వింద్ వాల్దాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8 మంది బిజెపి అబ్యర్థులు పార్లమెంట్ ఎంపిలుగా గెలుపొందారన్నారు. ఈమేరకు వారు ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు కాగా ఆ 8 మంది బిజెపి పార్లమెంట్ అభ్యర్థులు గురువారం హైద్రాబాద్ వస్తున్న సందర్భంగా ఎంపి అభ్యర్థులతో బేగంపేట విమానాశ్రయం నుండి నాంపల్లిలో గల బిజెపి కార్యాలయం వరకు భారీ కార్ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈమేరకు ఈ ర్యాలీకి నర్సాపూర్ నియోకవర్గం నుండి భారీ సంఖ్యలో బిజెపి నాయకులం తరలి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు బిజెపి నాయకులు పలు వాహానాల్లో బయిలేదేరి వెళ్లారు. ఈకార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర నాయకులు అర్వింద్ వాల్దాస్ తో పాటు బిజెవైఎం నర్సాపూర్ అధ్యక్షులు రాజేశ్, కొల్చారం అధ్యక్షులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల
## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు**


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో గేటుకు సమస్యలతో కూడిన వినతి పత్రం ఇస్తున్న నాతరాజు, కార్మికులు

**నర్సాపూర్, జూన్ 20, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగకాజు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో గేటుకు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ 9నెలలుగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు రాక వారి కుటుంభాలను పోషించుకోవడానికి అప్పులు తెచ్చి అప్పుల పాలవుతున్నారని అన్నారు. గ్రామాల్లో అనేక సేవలు చేస్తు ప్రజల ఆరోగ్యాలు, పల్లెలు అందంగా ఉండేలా చేస్తున్న శ్రామికుడు పంచాయతీ కార్మికుడేనని గుర్తు చేశారు. వేతనాలు సమయానికి రాక కుటుంబ సభ్యులు పస్తులుంటున్నారని, అలాగే పిల్లల చదువుల పీజుల కోసం తిప్పలు పడుతున్నారని అన్నారు. అంతేగాక ప్రమాదవశాత్తున ఈ కార్మకులు చనిపోతే అట్టి ఖర్చులు కూడ ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పని చేసే ప్రదేశంలో చనిపోతే 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అంత్యక్రియల ఖర్చులు 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దరలకునుగుణంగా వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతాయని కడారి నాగరాజు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బందెలి సలీం, నర్సింలు, మల్లేషం, పోచయ్య, లింగం, పెంటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

**హుస్నాబాద్, జూన్ 20, ప్రభాతవార్త :** గత ప్రభుత్వం హుస్నాబాద్ ప్రాంత ప్రజలు, క్రీడాకారులరు కోసం కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని అధికారులు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని బిఆర్ఎస్ నాయకులు బత్తుల జగ్గీవన్‌రామ్ డిమాండ్‌చేశారు. గురువారం పట్టణంలోని ఇండోర్ స్టేడియాన్ని సందర్శించి మాట్లాడుతూ కోట్లు పెట్టి ప్రజా సౌకర్యార్థం నిర్మించిన స్టేడియం తాళంవేసి ఉండడంతో ఉదయం సాయంత్రం వాకింగ్ చేసే వారు ఇబ్బందులు పడుతున్నాని ఆరోపించారు. క్రీడాకారుల కోరిక మేరకు ఇప్పటికైనా అధికారులు ఇండోర్ స్టేడియాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## అంగన్‌వాడీ సెంటర్‌కు ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు అందజేత

**అక్కన్నపేట, జూన్ 20, ప్రభాతవార్త:** మండలంలోని రామవరం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విషయం తెలుసుకున్న ఆ గ్రామ ఎంపిటిసి లింగాల శ్రీనివాస్ గురువారం పాఠశాలకువెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్లు, లైట్లు లేకపోవడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందని తెలుసుకుని వెంటనే తన సొంత ఖర్చులతో రెండు పాఠశాలలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పాఠశాలలకు ఫ్యాన్లు, లైట్లు అందించిన ఎంపిటిసి శ్రీనివాస్‌కు అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల నర్సింహులు, గంగాధర్, సంపత్, చందు, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు కళాశాలలు వద్దు.. ప్రభుత్వ కళాశాలలు ముద్దు

**చిన్నశంకరంపేట, జూన్ 20, ప్రభాతవార్త:** ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ తెలిపారు. గురువారం కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిచే ఉచిత పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రైవేటు కళాశాలకు దీటుగా బోధిస్తున్నామని, పది పూర్తి చేసిన విద్యార్థులు తప్పనిసరిగా ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. అనుభవం కలిగిన అధ్యాపకులచేత విద్యను బోధిస్తున్నామని, ఉమ్మడి జిల్లాలోనే చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తూ వ్యాపారాన్ని సాగించాలి

**-డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి**

**జహీరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:**

దాబా, బార్ అండ్ రెస్టారెంట్, హోటళ్ల యజమానులు నిబంధలు పాటిస్తూ వ్యాపారాలను నిర్వహించుకోవాలని డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం సబ్ డివిజన్ పరిధిలోని జహీరాబాద్, చిరాగ్‌పల్లి, కోహీర్, హద్నూర్, రాయికోడ్, ఝరాసంగం పోలీసుఠాణాలో పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్, హోటళ్లు, ధాబా హోటళ్ల యజమాను లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రాత్రి 12 గటలకు బార్ అండ్ రెస్టారెంట్, ధాబా హోటళ్లు విధిగా బంద్ చేయాలని ఆదేశించారు. ఎవరికి వారు సిఇ కెమెరాలను బిగించుకోవా లన్నారు. దాబా హోటళ్లలో మద్యం తాగరాదని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సిఇ ఆర్ రవి, ఎస్ఐలు లక్ష్మారెడ్డి, వరప్రసాద్ కృష్ణ, సురేష్‌ల పాల్గొన్నారు.


దాబా, హోటల్ యజమానులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి



బోరంచ నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భూపాల్‌రెడ్డి దంపతులు

## ఘనంగా బోరంచ నల్లపోచమ్మ జాతర ఉత్సవాలు

**మనూర్, జూన్ 20, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో నల్లపోచమ్మ ఏడు వారాల జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 7 వారాల జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం 6వ గురువారం జాతరను పురస్కరించుకుని అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ధర్మపత్ని జయశ్రీరెడ్డితో కలిసి ఆలయానికి చేరుకుని అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌స్వామి, సిద్దు స్వామి, నాగయ్య స్వామి, ప్రవీణ్‌స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు కార్పొరేటర్ భూమి పూజ



సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పోరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూన్ 20, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మాణం చేసే సిసి రోడ్డు పనులకు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ భూమి పూజ చేసి ప్రారంభించారు. సిసి రోడ్డు పనులు పూర్తయితే ప్రజలు సౌకర్యవంతంగా ఉంటుందని పుష్ప నగేష్ అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మణ్‌యాదవ్, రవి, కిరణ్‌గౌడ్, యాదిరెడ్డి, అప్పల భాస్కర్, పందరి గోపాల్‌రెడ్డి, కృష్ణరెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

## వెలిమెల పాఠశాలలో యోగ దినోత్సవం

**రామచంద్రాపురం, జూన్ 20, ప్రభాతవార్త:** భారత వికాస్ పరిషత్, తెలంగాణ రీజియన్ ఆధ్వర్యంలో గురువారం వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్‌లో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. త్రివేణి నిర్వహించిన యోగా కార్యక్రమానికి 575 మంది విద్యార్థులు పాల్గొని యోగాభ్యాసం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ భారత వికాస్ పరిషత్ అధ్యక్షుడు దాసరి సతీష్‌గౌడ్, రుద్రమ శాఖకు చెందిన పురుషోత్తం శాస్త్రి, మూర్తి, సుమతి, సంస్థ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఏఐటియుసి జిల్లా నేత చిరంజీవి**

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 20, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి అనుబంధ సంస్థ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి జిల్లా నాయకులు చిరంజీవి గురువారం డిమాండ్ చేశారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 975లో బడుగు బలహీన వర్గాల పిల్లలు రక్తహీనతకు గురికావద్దన్న సదుద్దేశంతో ఐసిడిఎస్‌ను ఏర్పాటు చేసిందని, నాటినుంచి అంగన్‌వాడీలో టీచర్లు, హెల్పర్లు విద్యార్థులకు సేవలు అందిస్తున్నారన్నారు. నాటినుంచి చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకునేందుకు పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 26వేలు, హెల్పర్లకు 21వేల రూపాయలను ప్రతి నెల అందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదవీ విరమణ పొందుతున్న టీచర్లకు 2 లక్షలు, హెల్పర్లకు 1 లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీచర్లకు 1లక్ష, హెల్పర్లకు 50వేలు ఇస్తామన ప్రభుత్వం జిఓను జారీ చేయడం సరికాదని, జీవోతో 4 దశాబ్దాలుగా పని చేస్తున్న కార్మికులు తీవ్రంగా నష్టాలకు గురవుతాయని విచారం వ్యక్తం చేశారు. జీవోను వెంటనే రద్దు చేయాలని, గతంలో సమ్మె కాలంలో చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలపు వేతనాలు, రూ. 26వేలు, టిఏ, డిఏలను వెంటనే అందించాలన్నారు. అదనపు యాప్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. బకాయి ఇంటి అద్దె బిల్లుఉ, గ్యాస్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని చిరంజీవి డిమాండ్ చేశారు.

## మిషన్ భగీరథ సర్వేను పూర్తి చేయాలి : డిపివో



ముస్లాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డిపిఓ యాదయ్య

**అల్లాదుర్గం, జూన్ 20, ప్రభాతవార్త:** మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా పంచాయితీ అధికారి యాదయ్య మండల స్థాయి అధికారులకు ఆదేశించారు. గురువారం మండలంలోని ముస్లాపూర్, అల్లాదుర్గం, కాయితంపల్లి గ్రామాలను డిపిఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నర్సరీలను డిపిఓ పరిశీలించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నాయా లేదా అని పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభం అయినందున పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. కార్యమ్రంలో ఎంపిడిఓ శంకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, శ్రీనివాస్, వెంకటరత్నం, ఫీల్డ్ అసిస్టెంట్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చిన్నశంకరంపేట, జూన్ 20, ప్రభాతవార్త:** మండల పరిధి టీ.మాందాపూర్‌లోని విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మత్తుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ సతీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు గజగట్లపల్లి, టీ.మాందాపూర్, కోర్విపల్లి తండా, టీ.మాందాపూర్ తండాలలో విద్యుత్తు నిలిచిపోతుందని ప్రజలు, రైతులు సహరించాలని ఆయన కోరారు.

## నులిపురుగు నివారణ మందు వేసుకోవాలి

**చిన్నశంకరంపేట, జూన్ 20, ప్రభాతవార్త:** నులిపురుగు నివారణ మందులను 19 సంవత్సరాలలోపున్న ప్రతి విద్యార్థి తప్పనిసరిగా వేసుకోవాలని ఎంపీపీ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట మండలం జంగరాయిలోని ప్రాథమిక పాఠశాలలో నులిపురుగు నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మందులు వేసుకోని విద్యార్థులకు తిరిగి 27తేదిన అందించనున్నట్లు మండల వైద్యాధికారి సాయిసిందూ తెలిపారు.



నులిపురుగు నివారణ మందు పంపిణీని ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మిరెడ్డి

# నులిపురుగుల నిర్మూలనకు 'ఆల్బెండజోల్' వేయాలి

**ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవరెడ్డి**



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, జూన్ 20 (ప్రభాతవార్త):** నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజ్ఞాపూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని, దీనివల్ల కడుపులో నులిపురుగులు చనిపోతాయన్నారు. అలాగే ఆకలి బాగా అవుతుందని, చిన్నపిల్లలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. పాఠశాలకు వచ్చేటప్పుడు ఆహారం తీసుకోకుండా వస్తుంటారని, వారికి కడుపులో నులిపురుగులు ఉండడం వల్ల సరైన ఆకలికాక మనం తిన్న ఆహారం సరిపోక చదువుపై శ్రద్ధ ఉండదన్నారు. కడుపులో నులిపురుగులు ఉండడం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతారని, తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పంగ మల్లేశం, కౌన్సిలర్ పంబాల అర్చన శివ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్బేర్‌సింగ్, సిహెచ్ఓ కాశీం, సూపర్వైజర్ అనిత, హెల్త్‌అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, రమేష్, అంగన్వాడీ టీచర్లు రాణి, రజిత, రమ, సుల్తానా, ప్రధానోపాధ్యాయుడు కృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులక నూలిపురుగు నివారణ బిళ్లలను అందిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## నులిపురుగు నివారణతోనే పిల్లల్లో ఆరోగ్యం

**-ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు**

**జహీరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** నులిపురుగు నివారణతోనే విద్యార్థులు ఆరగ్యోంగా ఉండగలుగుతారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు మందు బిళ్లలను ఎమ్మెల్యే అందించారు. ప్రతి విద్యార్థి మందు బిళ్లను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, బిఆర్ఎస్ ఝురాసంగం మండల అధ్యక్షులు వెంకటేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ తంజీమ్ పట్టణ మాజీ అధ్యక్షులు మోమియోద్దిన్, మాజీ కౌన్సిలర్లు నామ రవికిరణ్, అబ్దుల్లా, నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శివప్ప, సత్యంముదిరాజ్, వెంకట్‌సాగర్, అధికారులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మాత్రలు పంపిణీచేసిన ఎమ్మెల్యే



విద్యార్థులకు నులిపురుగు నివారణ బిళ్లను అందచేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 20, ప్రభాతవార్త:** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యను సులువుగా అందుకోగలుగుతారని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థినులకు అంతర్జాతీయ నూలి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మందు బిళ్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివిద్యార్థి విధిగా నులిపురుగు నివారణ బిళ్లలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదవరెడ్డి, మన్నది కిషోర్, వైద్యాధికారి రాజేశ్వర్, ఆత్మకూరి రాజు, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపిపి బాలేషంగౌడ్

**జగదేవ్‌పూర్, జూన్ 20 (ప్రభాతవార్త):** పిల్లల్లో వచ్చే నులిపురుగుల నివారణకు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని ఎంపిపి బాలేషం గౌడ్, ఎంపిడిఓ యాదగిరి అన్నారు. గురువారం మండల పరిధిలోని అలిరాజపేట సెయింట్ విన్సెంట్ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలు ఆల్బెండజోల్ మాత్రలను తప్పకుండా వేసుకోవాలన్నారు. ఈ మాత్రలను అన్నం తిన్న తర్వాత వేసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి సత్య ప్రకాష్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాసవర్మ, జగదేవ్‌పూర్ పిహెచ్‌సి సిహెచ్ఓ శ్రీమతి, ఆరోగ్య కార్యకర్తలు, పిహెచ్‌సి సిబ్బంది జితేందర్‌రెడ్డి, రజనికుమారి, దీవెన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానెట్, ఆశ కార్యకర్తలు స్వరూప, నిర్మల, కవిత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేసిన ఎడిఎ

వెల్దుర్తి, జూన్20 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎరువుల దుకాణాల్లో గురువారం కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో అమ్మకపు రిజిష్టర్‌ను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచి విక్రయించాలన్నారు. నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణాల నిర్వాహకులు ఉన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తదితరులు

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, జూన్ 20 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి గురువారం కౌన్సిలర్ వంటేరు గోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి సిసి రోడ్డును నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, నాయకురాలు వంటేరు ఉమ, వార్డు అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్, కాంట్రాక్టర్ బాలకృష్ణరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 1-19 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎంపీపీ మంజుల కాశీనాథ్

**కొల్చారం, జూన్ 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ కొరబోయిన మంజుల కాశీనాథ్‌తో కలిసి రంగంపేట వైద్యాధికారి హర్షిత నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అలాగే కొల్చారంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి రమేష్ నాయక్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మంజుల కాశీనాథ్, డాక్టర్ రమేష్ నాయక్‌లు మాట్లాడుతూ 1-19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు అన్ని ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు కలగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్ రూరల్, జూన్20 ప్రభాతవార్త:** 1-19 సంవత్సరాల పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని మెదక్ డీడబ్ల్యూవో బ్రహ్మాజీ అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అలాగే పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్ హేమలత, ఆయా, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాల ఏర్పాటుకు భవనం పరిశీలన

**వెల్దుర్తి, జూన్20 ప్రభాతవార్త:** మాసాయిపేటలో కస్తూర్బా గాంధీ పాఠశాల ఏర్పాటు కోసం గర్ల్ చైల్డ్ డెవలపెమెంట్ ఆఫీసర్ సుకన్య భవనాన్ని పరిశీలించారు. మాసాయిపేటకు మంజూరైన కస్తూర్బాగాంధీ పాఠశాల కోసం ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకోవడానికి పరిశీలించగా భవనం భద్రతా పరంగా అనువుగా లేదని తిరస్కరించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత భవనం గదులను పరిశీలించి భవన గదులకు అవసరమైన మరమ్మతులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, నీటి వసతి ఏర్పాటు కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేయాలని స్థానిక ఎంపీటీసీ కృష్ణారెడ్డికి సూచించారు. నిధులు మంజూరు చేయగానే పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని కృష్ణారెడ్డి తెలిపారు. మాసాయిపేటకు మంజూరైన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన ఆరు, ఏడవ తరగతులకు సంబంధించి 80 విద్యార్థినిలు ఉన్నారని, వీరు ప్రస్తుతం వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుకుంటున్నారని, భవనం సిద్ధంకాగానే విద్యార్థినిలను మాసాయిపేటకు తరలించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు, హరిరజంన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ పాఠశాల ఏర్పాటు కోసం భవనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రను వేస్తున్న పుష్పనగేష్

## ఘనంగా నులిపురుగు నివారణ దినోత్సవం

**రామచంద్రాపురం, జూన్ 20, ప్రభాతవార్త:** జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని ఓల్డ్ రామచంద్రాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అల్బెండజోల్ మందు బిళ్లను తినిపించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో విద్యార్థులకు మందు బిళ్లను వేశారు. ఈసందర్భంగా బూరుగడ్డ పుష్పనగేష్, ఆసుపత్రి డాక్టర్ కల్పన మాట్లాడుతూ నులిపురుగు నివారణకు 1 ఏడాది నుంచి 19 ఏళ్లగల వారు విధిగా మందు బిళ్లలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాథోడ్, భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

**బొంబాయినగర్ కాలనీలో...**

**రామచంద్రాపురం, జూన్ 20, ప్రభాతవార్త:** జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని గురువారం భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. అంగన్‌వాడి కేంద్రంలోని విద్యార్థులకు కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అల్బెన్డోజోల్ మందు బిళ్లలను కార్పొరేటర్ మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా విద్య, భోజనాన్ని అందించడంతోపాటు వైద్య సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, అంగన్‌వాడి టీచర్ పద్మ, యమున, సర్కిల్ యూత్ అధ్యక్షులు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి : ఏవో

**ఝరాసంగం, జూన్ 20, ప్రభాతవార్త:** రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశం తెలిపారు. గురువారం మండంలోని జీర్లపల్లి, దేవరంపల్లి, బర్దిపూర్, కృష్ణాపూర్, కుప్పానగర్, నర్సాపూర్, ఏడు కులపల్లి గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, అందుకు రైతులు పంట నమోదు చేసుకోవాలని, ఫలితంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు వీలుంటుందన్నారు. జీర్లపల్లి గ్రామంలో రైతులు సాగుచేస్తున్న పత్తి పంటను ఏఓ వెంకటేశం పరిశీలించి రైతులకు పంట అధిక దిగుబడికి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు సుకుమార్, వినోద్‌కుమార్, హరికృష్ణ, సంపత్ కుమార్, రేణుఖ, శివప్రియ, జ్ఞానం భారతి, రైతులు నర్సింలు, రాజన్న, శేఖర్, జైపాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

**నాగల్‌గిద్ద, జూన్ 20, ప్రభాతవార్త:** మోర్గి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో సాంఘీక శాస్త్రం, హిందీ, ఆంగ్లం బోధించేందుకు ఉపాధ్యాయులు అవసరమని, అందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అర్హులు దరఖాస్తులు అందచేయాలన్నారు. సాంఘీక శాస్త్రం, హిందీ బోధించేందుకు టెట్, బిఎడ్, ఆంగ్లం బోధించేందు ఎంఏ బిఎడ్ ఇంగ్లీష్‌లో అర్హతలు సాధించి ఉండాలన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అందుకు పాఠశాల కార్యాలయంలో బయోడెటా, సర్టిఫికెట్లు అందచేయాలని ప్రిన్సిపాల్ రమేష్ సూచించారు.

## ఉపాధ్యాయ బదిలీలు ఆఫ్‌లైన్‌లోనే చేపట్టాలి

**-పిఆర్‌టియు మండల కార్యదర్శి పంతులు రాజు**

**పాపన్నపేట, జూన్ 20, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ బదిలీలు ఆఫ్ లైన్ విధానంలోనే చేపట్టాలని పిఆర్‌టియు మండల కార్యదర్శి పంతులు రాజు ప్రభుత్వాని కోరారు. గురువారం రాజు మాట్లాడుతూ ఉపాధ్యా బదిలీలలో ఇటీవల మల్టీజోన్ 1లో చేపట్టిన పదోన్నతులలో అనేక సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడంతో ఉపాధ్యాయుడికి ఏ ప్రమోషన్ వస్తోందో తెలియక అర్హతఉన్న అన్ని సబ్జెక్టులను ఆప్షన్ ఇవ్వడంతో కొందరు మూడు సబ్జెక్టులలో పదోన్నతి తీసుకుని ఒక సబ్జెకులో మాత్రమే చేరవలసి ఉందని, మిగతా రెండు సబ్జెక్టు పోస్టులు బ్యాక్ లాగ్ అయ్యే అవకాశం ఉందన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లలో ఎస్జీటీలు అధికంగా ఉంటారని దీంతోద వెబ్ కౌన్సెలింగ్ ద్వార ఆప్షన్స్ ఇవ్వడం ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతారన్నారు. సీనియార్టీ లిస్టులో 1000 వేఇ నంబరు ఉన్న ఉపాధ్యాయుడు 1000 ఆప్షన్లు ఇవ్వడంతో గందరగోళంకు ఉపాధ్యాయులు గురయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు ఆఫ్‌లైన్ విధానంలో చేపట్టాలని, అలా వీలు కాకుంటే రోజుకు 300 చొప్పున వెబ్ ఆప్షన్ విధానంలో బదిలీలు కొనసాగించాలని ప్రభుత్వానికి పంతులు రాజు సూచించారు.

## నర్సింలు కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆర్‌డిఓకు వినతిపత్రం అందచేస్తున్న నర్సింహులు కుటుంబ సభ్యులు

**జహీరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** మే 18వ తేదీన కోహీర్ మండలంలోని బడంపేట్‌లో రాత్రి సమయంలో బేగరి నర్సింలు మృతికి కారకులైన నిందితులకు కఠినంగా శిక్షించడంతోపాటు అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని గురువారం సమతా సైనిక్ ఆధ్వర్యంలో నర్సింలు కుటుంబ సభ్యులు ఆర్‌డిఓ రాజుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ రాజు డిఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడి నిందితులను అందరిని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఓ హామి చేశారు.

## విద్యార్థులకు దుస్తులు, అల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 20, ప్రభాతవార్త :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా రామాయంపేట మున్సిపాలిటీ 1వ వార్డుపరిధిలోని దళితవాడ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు గురువారం నాడు అల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఏకరూప దుస్తులను కౌన్సిలర్ బొర్ర అనిల్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు ఎస్.కె.అహ్మద్ పంపిణీచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు వెలుముల నాగేందర్, అపర్ణ, కవిత, ఎఎన్ఎంలు బాబలక్ష్మి, స్వప్న, ఆశ వర్కర్ జ్యోతి, మిడ్‌డే మీల్స్ యాదమ్మతో పాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ అనిమియా నిర్మూలనపై అవగాహన

**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ సెక్రెటరీ ఆదేశాలమేరకు జిల్లా గిరిజన అభివృద్ధి మెదక్ ఆధ్వర్యంలో బుధవారం గిరిజన విద్యార్థులకు సికిల్ సెల్ అనిమియా నిర్మూలన ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైబర్ వెల్ఫేర్ ఈఈ/ఎస్ఈ హేమలత, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో శ్రీరామ్, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది, జి. లక్ష్మీనారాయణ, జి. శ్రీకాంత్, పి. శ్రీకాంత్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 20, ప్రభాతవార్త :** బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం...దామరచెరువు గ్రామానికి చెందిన కుస్తి నారాయణ (35) తన బైక్‌పై పట్టణానికి వస్తున్న క్రమంలో పెద్దమ్మ గుడి సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేసినట్లు వైద్యులు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

**మండల సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**మనూర్, జూన్ 20, ప్రభాతవార్త:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్యసమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే అభివృద్ధి పనులు నాణ్యతగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామపంచాయితీలకు నిధులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో స్వయంగా మాట్లాడతానన్నారు. కమలాపూర్ చెరువువద్ద పనులు సక్రమంగా చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఎంపిపి కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి ఇరిగేషన్ ఏఈని ప్రశ్నించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చెరువువద్ద కాల్వల మరమ్మతులు పనులు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పదవీ కాలం పూర్తిచేసుకున్న ఎంపిటిసి సభ్యులను, ఎంపిపి అధ్యక్షురాలని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అలివేలు మంగ, తహసీల్దారన వెంకటస్వామి, అధికారులు వివేకానంద్, డాక్టర్ నర్సింగ్ చౌహాన్, అశోక్‌రెడ్డి, రాకేష్, శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, రుక్మిణి బాయి, సలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.